క్లుప్తంగా

సర్వేను వేగవంతం చేయండి



సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీఓ సత్తయ్య

కంగ్టి(నారాయణఖేడ్): ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక సర్వేను వేగవంతం చేయాలని ఎంపీడీఓ సత్తయ్య పంచాయతీ సెక్రటరీలు, ఇందిరా క్రాంతి పథకం అధికారులను ఆదేశించారు. సోమవారం మండలంలోని ఘన్‌పూర్, జమ్గి(కే), చాప్టా(కే) గ్రామాల్లో నిర్వహిస్తున్న సర్వేను ఎంపీడీఓ సత్తయ్య తనిఖీ చేశారు. ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమంలో మండలంలో మొత్తం 12,090 మంది ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. ఆయా గ్రామాల్లో వీఆర్‌ఏలు, సీసీలు, పంచాయతీ సెక్రటరీలు చేస్తున్న సర్వేను పరిశీలించారు. కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం కిష్టయ్య, సీసీరేణుక లబ్ధిదారులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాలకు కృషి



ఏర్పాట్లను పరిశీలిస్తున్న చైర్మన్, వైస్ చైర్మన్

నారాయణఖేడ్: మున్సిపాలిటీ పరిధిలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామని మున్సిపల్ చైర్మన్ ఆనంద్ స్వరూప్ షెట్కార్, వైస్ చైర్మన్ దారం శంకర్‌సేట్ తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని మంగల్‌పేట్‌లో సీసీ రోడ్డు నిర్మాణం పనులకు సోమవారం భూమిపూజ చేశారు. అనంతరం పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అంతర్గత సీసీ రోడ్లు, మురుగుకాల్వలు, తాగునీరు, వీధిదీపాలు, పచ్చదనం, పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. ప్రజలు చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా చెత్త తరలింపు ఆటోల్లో వేస్తూ స్వచ్ఛత, మున్సిపల్ అభివృద్ధికి సహకరించాలని కోరారు.

పన్ను వసూళ్లపై వత్తిడి సరికాదు

నారాయణఖేడ్: ఇంటిపన్నుల వసూళ్లకు గ్రామాలు, తండాల్లో కార్యదర్శులు పేదలపై వత్తిడి చేయడం సరికాదని ఖేడ్ తాజా మాజీ జెడ్పీటీసీ లక్ష్మీబాయి పేర్కొన్నారు. సోమవారం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ.. చాలా మంది ప్రజలు ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వలసలు వెళ్లారన్నారు. వారికి ఫోన్లు చేసి ఇంటి పన్నులు చెల్లించాలని, ఇందిరమ్మ ఇల్లు మంజూరు కావాలంటే పన్ను రశీదు ఉండాలని చెబుతూ వారిని సొంత గ్రామాలకు రప్పించి పన్నులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. కలెక్టర్ కల్పించుకుని పేదలపై వత్తిడి తీసుకురాకుండా చూడాలని కోరారు.

ఉచిత పశువైద్య శిబిరం



కంగ్టి(నారాయణఖేడ్): మండలంలోని నాగన్‌పల్లిలో పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో సోమవారం ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. పశువులకు ఉచిత గర్భాధారణ చికిత్సలు చేసినట్లు గోపాలమిత్రులు రాజేందర్‌రావు పాటిల్, సిద్దారెడ్డి తెలిపారు. దూడలకు నట్టల నివారణ కోసం డీవార్మింగ్ మందులు వేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో రైతులు బాబురావు పాటిల్, సిద్దారెడ్డి, స్థానికులు పాల్గొన్నారు.

విద్యార్థినికి సన్మానం

జహీరాబాద్ టౌన్: పదవ రాష్ట్రస్థాయి సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల క్రీడాపోటీల్లో గోల్డ్ మెడల్ సాధించిన విద్యార్థిని ఎమ్మెల్యే మాణిక్‌రావు సన్మానించారు. భద్రాది జిల్లాలోని కమ్మదానంలో జరిగిన పోటీల్లో మండల కేంద్రం కోహీర్‌కు చెందిన అక్షయ లాంగ్ జంప్ పోటీలో గోల్డ్ మెడల్ సాధించింది. ఈ సందర్భంగా సోమవారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే ఆమెను సన్మానించారు. కార్యక్రమంలో మొగుడంపల్లి మండల బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు సంజీవ్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ఘనంగా అనఘా దత్త వ్రత మహోత్సవం

సంగారెడ్డి టౌన్: ఫసల్వాదిలోని జ్యోతిర్వాస్తు విద్యాపీఠంలో అనఘా దత్త మహోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. 215 గ్రామాల నుంచి వచ్చిన 2,400 మంది మహిళలు వ్రత మహోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. విద్యాపీఠం వ్యవస్థాపకులు బ్రహ్మశ్రీ డాక్టర్ శ్రీ మహేశ్వర శర్మ సిద్ధాంతి పూజలు నిర్వహించారు. అనఘా దత్త వ్రత మహోత్సవం కార్యక్రమం విశిష్టత గురించి భక్తులకు వివరించారు. కార్యక్రమంలో విద్యాపీఠం సభ్యులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

దళారుల మాయాజాలం

- గొలుసు కాంటాలతో రైతుల దగా..
- నియంత్రించలేకపోతున్న అధికారులు

వట్‌పల్లి (అందోల్): దేశానికే రైతు వెన్నుముక, రైతులేనిదే రాజ్యం లేదనేవి కేవలం మాటలకే పరిమితమవుతున్నాయి. ప్రభుత్వాలు రైతును రాజుగా చేసేందుకు ఎన్ని ప్రయత్నాలు చేసినా అధికారుల పట్టింపులేని తనంతో దళారుల దోపిడీ రాజ్యమేలుతుంది. వట్‌పల్లి మండలమంతా వర్షాధార పంటగా ప్రధానంగా పత్తిసాగు చేస్తారు. ప్రస్తుతం పంట చేతికి రావడంతో ఇతర ప్రాంతాల నుంచి దళారులు పత్తిని కొనుగోలు చేసేందుకు గ్రామాల్లో వాలిపోయారు. నాణ్యత లేకున్నా ఎక్కువ ధర చెల్లిస్తున్నామని తూకంలో మోసాలకు పాల్పడుతున్నారు. నిత్యం మండలంలో పదుల సంఖ్యలో లారీలు లేదా డీసీఎంల్లో పత్తిని కొనుగోలు చేసి తరలిస్తున్నారు. నిబంధనల ప్రకారం పత్తి కొనుగోళ్లకు ఎలక్ట్రానిక్ కాంటాలు వినియోగించాలి.. కానీ మచ్చుకు కానరావడం లేదు. రాళ్లు, పాత బాట్లతో తూకం వేస్తూ క్వింటాలుకు 5 నుంచి 6 కిలోల వరకు రైతులను మోసం చేస్తున్నారు. దీంతో పాటు క్వింటాకు కిలో తరుగు తీసుకుంటున్నారు. ప్రతి సీజన్‌లో ఇదే తంతు కొనసాగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి.



గొలుసు కాంటాతో తూకం చేస్తున్న దళారులు

బెల్టు షాపులు ఎత్తివేయాలని నిరసన

జోగిపేట(అందోల్): బెల్ట్ షాపులను ఎత్తివేయాలని అందోల్ మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన మహిళలు దళిత సంఘాల ఆధ్వర్యంలో సోమవారం జోగిపేట ఎక్సైజ్ కార్యాలయం ఎదుట నిరసనకు దిగారు. గ్రామాల్లో విచ్చలవిడిగా బెల్టు షాపులు ఏర్పాటు చేసి మద్యం విక్రయిస్తున్నారని, దీంతో యువత మద్యానికి బానిసై తరచూ గొడవలకు దిగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే గ్రామాల్లోని బెల్ట్ షాపులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. బెల్ట్ షాపులు తొలగించని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని దళిత సంఘాల నాయకులు హెచ్చరించారు. అనంతరం జోగిపేట ఎక్సైజ్ సీఐ విజయ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు మల్లేశం, ప్రసాద్, గోపాల్, మహేశ్, చెట్టయ్య, యాదయ్య, సటికే రాజు, దివ్య, శ్రీలత, నిర్మల, దుర్గమ్మ పాల్గొన్నారు.



ఎక్సైజ్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న మహిళలు

మార్కెట్‌లో క్రిస్మస్ సందడి

నారాయణఖేడ్: ఈ నెల 25న క్రిస్మస్ పర్వదినం పురస్కరించుకొని నారాయణఖేడ్ మార్కెట్‌లో పండగ సందడి నెలకొంది. క్రిస్టియన్ సోదరులు షాపింగ్ చేస్తుండడంతో దుకాణాలు సోమవారం కిటకిటలాడాయి. పండగ సందర్భంగా దుకాణాదారులు ఇళ్లు, చర్చిలను అలంకరించుకోవడం కోసం స్టార్లు, క్రిస్మస్ ట్రీలు, క్రిస్మస్ తాతయ్యలు ధరించే గౌన్లు, క్యాండిల్స్, ఇతర సామగ్రిని సిద్ధంగా ఉంచారు. దీంతో మార్కెట్‌లో సందడి వాతావరణం కనిపించింది.



దుకాణంలో క్రిస్మస్ సామగ్రి

100 కిలోల ప్లాస్టిక్ సీజ్



జరిమానా రశీదును అందజేస్తున్న శ్రీనివాస్

నారాయణఖేడ్: మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్ ఆదేశాల మేరకు మున్సిపల్ శానిటరీ అధికారి శ్రీనివాస్ సోమవారం పట్టణంలో సిబ్బందితో కలిసి దుకాణాలు, వ్యాపార, వాణిజ్య సంస్థల్లో ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ప్లాస్టిక్ కవర్లు, గ్లాసులు విక్రయిస్తున్న దుకాణాల యజమానులకు జరిమానా విధించి రశీదులు అందజేశారు. 100 కిలోల ప్లాస్టిక్‌ను సీజ్ చేశారు. ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే అనర్థాలను దుకాణదారులతో పాటు ప్రజలకు వివరిస్తూ అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ వినియోగించినా, విక్రయించినా చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఆలయ భూమిని కాపాడాలంటూ ధర్నా

జిన్నారం (పటాన్‌చెరు): ఆలయ భూములను కాపాడాలంటూ సోమవారం జిన్నారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట గ్రామస్తులు ధర్నా చేశారు. మండల కేంద్రంలోని తాబేలు గుట్టపై నూతనంగా నిర్మిస్తున్న జీవన జ్యోతిర్లింగ భూమిని గ్రామానికి చెందిన కొందరు ఆక్రమించేందుకు యత్నిస్తున్నారని ఆందోళనకు దిగారు. ఈ విషయంపై గతంలోనూ తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసిన అధికారులు స్పందించలేదన్నారు. ఉన్నతాధికారులు స్పందించి ఆలయ భూమిని కాపాడాలని కోరారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు ప్రతాప్‌రెడ్డి, శ్రీనివాస్ యాదవ్, రాజిరెడ్డి, రాజేందర్‌రెడ్డి, నరసింహులు, రంగారెడ్డి, మహేందర్‌గౌడ్, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



తహసీల్దార్ ఆఫీస్ ఎదుట ధర్నా చేస్తున్న గ్రామస్తులు

ఘనంగా మల్లన్న జాతర



ఏనుగు రథంపై ఊరేగుతున్న మల్లన్నస్వామి

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్‌కు సమీపంలోని కర్ణాటకలో గల మైలార్ మల్లన్న జాతర ఉత్సవాలు ఘనం నిర్వహించారు. ఈ ఉత్సవాలు 3వ తేదీ వరకు ఉత్సవాలు కొనసాగనున్నాయి. ఈ సందర్భంగా ఆదివారం రాత్రి మల్లన్న స్వామిని ఏనుగు రథంపై ఊరేగించారు. తెలంగాణ, కర్నాటక రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ ప్రకాష్ మైత్రే, కార్యనిర్వహణ అధికారి అనంత్‌రావు కుల్‌కర్ణి, ప్రధాన అర్చకులు బసప్ప హిరివాగ్గె, మేనేజర్ సంజీవ్ కుమార్ పాల్గొన్నారు.

త్వరలో డ్రైనేజీ పనులు చేపడతాం

ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు టౌన్: డివిజన్ పరిధిలోని కాలనీల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి ప్రణాళికాబద్ధంగా నిధులు కేటాయించడంతో పాటు, మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం డివిజన్ పరిధిలోని శాంతినగర్, శ్రీనగర్ కాలనీల్లో స్థానిక కార్పొరేటర్ మెట్టుకుమార్ యాదవ్, జీహెచ్‌ఎంసీ డిప్యూటీ కమిషనర్ సురేష్‌తో కలిసి ఎమ్మెల్యే పర్యటించారు. ఈ సందర్భంగా అండర్ గ్రౌండ్ డ్రైనేజీలు నిర్మించి చాలా ఏళ్లు కావడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని కాలనీవాసులు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. స్పందించిన ఎమ్మెల్యే .. త్వరలో ప్రతిపాదనలు సిద్ధం చేసి పనులు చేపడతామని తెలిపారు. అభివృద్ధిలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, కాలనీ ప్రజలు పాల్గొన్నారు.



డ్రైనేజీని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

భూసార పరీక్షలు చేయించాలి



మట్టి నమునాలు సేకరిస్తున్న నూతన్‌కుమార్

కల్హేర్(నారాయణఖేడ్): తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయించుకోవాలని నారాయణఖేడ్ డివిజన్ వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు(ఏడీఏ) నూతన్‌కుమార్ రైతులకు సూచించారు. సోమవారం మండలంలోని కృష్ణాపూర్‌లో మట్టి నమునాలు సేకరించారు. భూసార పరీక్షలు చేయించుకుంటే పంట సాగు కోసం ఎరువుల వాడకం, తదితర పద్ధతులు పాటించి దిగుబడి సాధించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఏఈఓ కృష్ణవేణి, పండరి పాల్గొన్నారు.

'ఐడీఎస్ఎంటీ' సమస్య పరిష్కరించాలి



ఎంపీకి వినతిపత్రం ఇస్తున్న రాములు నేత

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని ఐడీఎస్ఎంటీ కాలనీ లబ్ధిదారుల సమస్య పరిష్కరించాలని మాజీ కౌన్సిలర్ రాములునేత ఎంపీ.సురేష్‌కుమార్‌ను కోరారు. సోమవారం పట్టణానికి వచ్చిన ఎంపీకి ఆయన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాములు నేత మాట్లాడుతూ.. పట్టణంలో సొంత ఇళ్లు లేని కుటుంబాలకు స్థలాలు ఇవ్వాలనే ఉద్దేశంతో 1982 సంవత్సరంలో ఇంటిగ్రేటెడ్ డెవలప్‌మెంట్ ఫర్ స్మాల్ అండ్ మీడియం టౌన్(ఐడీఎస్ఎంటీ) కాలనీ ఏర్పాటు చేసి లబ్ధిదారులకు ప్లాట్లు పంపిణీ చేశారని తెలిపారు. లబ్ధిదారుల ఎంపికలో అవకతవకులు జరిగాయని కొందరు కోర్టులో కేసు వేశారన్నారు. స్థానిక పరిస్థితుల దృష్ట్యా అర్హులైన వారు ఇళ్లు కట్టుకోవాడానికి అనుమతులు ఇవ్వాలని న్యాయస్థానం తీర్పు ఇచ్చిందన్నారు. కాని, మున్సిపల్ అధికారులు సమస్యను పరిష్కరించడంలేదన్నారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఎంపీని కోరారు.

మున్సిపాలిటీలో విలీనం చేయాలి



డీపీఓకు వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు

సంగారెడ్డి జోన్: జిన్నారం మండలంలోని నల్తూరు గ్రామాన్ని మున్సిపాలిటీలో విలీనం చేయాలని గ్రామస్తులు సోమవారం జిల్లా పంచాయతీ అధికారి సాయిబాబాకు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కొందరు వ్యక్తులు మా గ్రామాన్ని మున్సిపాలిటీ కలపకుండా అధికారులను తప్పుదారి పట్టిస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ప్రకటించిన గ్రామాల్లో నల్తూరు గ్రామం కూడా ఉందని, నల్తూరు పంచాయతీగానే ఉండాలని దురుద్దేశంతో అడ్డుకుంటున్నారని మండిపడ్డారు. నల్తూరును మున్సిపాలిటీలో కలిపి అభివృద్ధి చేయాలని కోరారు.

డ్రైనేజీ పనుల ప్రారంభం

జిన్నారం (పటాన్‌చెరు): బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని 18, 19వ వార్డుల్లో అంతర్గత మురికి కాల్వల పనులను సోమవారం మున్సిపల్ చైర్ పర్సన్ రోజా మాజీ జెడ్పీటీసీ బాల్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. కాలనీలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు సంధ్యా జైపాల్ రెడ్డి, హనుమంత్‌రెడ్డి, బీరప్పయాదవ్, ప్రభునాయక్, ఏఈ కిష్టయ్య, నాయకులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే కాంగ్రెస్ లక్ష్యం

ఎంపీ సురేష్ షెట్కార్

సంగారెడ్డి టౌన్: కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంక్షేమానికి చిత్తశుద్ధితో పనిచేస్తుందని జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్ , టీజీఐఐసీ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి అన్నారు. సోమవారం మాజీ ప్రధాని చౌదరిచరణ్ సింగ్ జన్మదిన దినోత్సవం, జాతీయ రైతు దినోత్సవాన్ని పురస్కరించుకొని పోతిరెడ్డిపల్లి రైతు వేదికలో మంజీర రైతు సమాఖ్య జిల్లా అధ్యక్షుడు పృథ్వీరాజ్ ఆధ్వర్యంలో జాతీయ రైతు దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదర్శ రైతులను సన్మానించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. గత ప్రభుత్వం రైతులకు రాయితీ విత్తనాలు, రాయితీ యంత్ర పరికరాలు ఇవ్వకుండా రైతులను మోసగించిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోపు 2 లక్షల లోపు రుణమాఫీ, రాయితీపై ఆధునిక వ్యవసాయ యంత్ర పరికరాలు, ఇరిగేషన్ పరికరాలు ఇస్తుందని చెప్పారు. రైతులకు ఉచిత వైద్యం పొందెందుకు ఆరోగ్య కార్డుల ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, సీడీసీ చైర్మన్ రాంరెడ్డి, వ్యవసాయ అధికారి శివప్రసాద్, పశుసంవర్ధక శాఖ జేడీ వసంతకుమారి, ఆత్మకమిటీ చైర్మన్ ప్రభు, మార్కెట్ కమిటీ చైర్మన్ కుమార్, రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.



రైతులను సన్మానించిన ఎంపీ, తదితరులు

మున్సిపాలిటీ ఏర్పాటు వద్దు

- రైతుల ఆందోళన
- ప్రభుత్వం పునఃపరిశీలించాలని వినతి



రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

జిన్నారం (పటాన్‌చెరు): గుమ్మడిదల మండలాన్ని మున్సిపాలిటీగా మార్చొద్దని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు సీజీఆర్ ట్రస్ట్ చైర్మన్ ఆధ్వర్యంలో రైతులు, స్థానిక నాయకులు మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై బైఠాయించి ధర్నా, రాస్తారోకో చేశారు. మున్సిపాలిటీ వద్దు మండలమే ముద్దు అని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నూతన మున్సిపాలిటీల ఏర్పాటులో భాగంగా గుమ్మడిదల మండలాన్ని చుట్టుపక్కల పంచాయతీలను కలుపుతూ మున్సిపాలిటీ ఏర్పాటును ఖండిస్తున్నామన్నారు. స్థానికుల అభిప్రాయాలను లెక్కచేయకుండా ప్రభుత్వం తీసుకున్న ఏకపక్ష నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నామని మండిపడ్డారు. గుమ్మడిదల మండలం పూర్తిగా వ్యవసాయ ఆధారిత ప్రాంతమని, మున్సిపాలిటీగా ఏర్పడితే ఇక్కడి రైతులకు తీవ్ర నష్టం వాటిల్లుతుందన్నారు. పునరాలోచన చేసి మండలంగానే కొనసాగించాలని డిమాండ్ చేశారు. రోడ్డుపై నిరసన తెలపడంతో రోడ్డుకు ఇరువైపులా భారీగా వాహనాలు నిలిచిపోయాయి. స్థానిక పోలీసులు కలగజేసుకొని నిరసనకారులకు సర్ది చెప్పారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నరసింహారెడ్డి, రైతు సంఘం నాయకులు బాల్‌రెడ్డి, దేవేందర్ రెడ్డి, లక్ష్మారెడ్డి, బాలకృష్ణారెడ్డి, సూర్యనారాయణ, స్థానిక నాయకులు, రైతులు పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించండి

జిన్నారం (పటాన్‌చెరు): తోళ్ల కార్ఖానా స్థలం అన్యాక్రాంతం కాకుండా కాపాడాలని శివానగర్ గ్రామస్తులు సోమవారం జిన్నారం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామంలోని 114 సర్వే నంబర్‌లో 20 సంవత్సరాల క్రితం అప్పటి ప్రభుత్వం తోళ్ల కార్ఖానా కార్మికుల ఉపాధికి 13 ఎకరాల భూమిని కేటాయించింది. ఇందులో కార్ఖానాకు 290 గజాల చొప్పున ఇవ్వగా అందులో కొంతవరకు మాత్రమే కార్ఖానాలు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం తోళ్ల పరిశ్రమలు మూతపడడంతో 13 ఎకరాల స్థలం ఏళ్ల తరబడి ఖాళీగా ఉంది. ఆ స్థలాన్ని ఆక్రమించాలని కొందరు వ్యక్తులు యత్నిస్తున్నారని అన్నారు. పేదలకు ఇంటి స్థలాలు కేటాయించాలని తహసీల్దార్, కలెక్టర్‌కు కోరుతూ వినతిపత్రం అందజేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో బీజేపీ సంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి నాయకులు పాల్గొన్నారు.



వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు

సంక్షిప్త వార్తలు

◆ **దయల్ యువర్ డీఎంకు విశేష స్పందన**

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్ ఆర్టీసీ డిపోలో సోమవారం నిర్వహించిన డయల్ యువర్ డీఎం కార్యక్రమానికి విశేష స్పందన వచ్చిందని మేనేజర్ జాకీర్ హుసేన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉ. 11 గంటల నుంచి మ.. 12 గంటల వరకు కొనసాగిందన్నారు.

◆ **బాధితుడికి పరామర్శ**

జహీరాబాద్ టౌన్: సాక్షి విలేకరి శ్రీనివాస్‌రెడ్డిని సోమవారం ఎమ్మెల్యే మాణిక్‌రావు, డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్ పరామర్శించారు. శ్రీనివాస్‌రెడ్డి తల్లి రెండు రోజుల క్రితం మృతి చెందింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు, శివకుమార్ కోహీర్‌లోని ఆయన నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి మనోధైర్యాన్ని నింపారు.

◆ **ఘనంగా జాతీయ రైతు దినోత్సవం**

జహీరాబాద్ టౌన్: మండలంలోని రంజోల్ రైతు వేదికలో సోమవారం జాతీయ రైతు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వ్యవసాయ విస్తరణ అధికారి ప్రదీప్‌కుమార్ కొండా లక్ష్మణ్ ఉద్యాన కళాశాల విద్యార్థులతో కలిసి కేక్‌కట్ చేశారు. ప్రదీప్‌కుమార్ మాట్లాడుతూ.. మాజీ స్వర్గీయ ప్రధాని చౌదరి చరణ్ సింగ్ జయంతిన జాతీయ రైతు దినోత్సవంగా జరుపుకుంటున్నారని చెప్పారు.

◆ **ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరి**

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ప్రతిఒక్కరు ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోతే చర్యలు తప్పవని కొల్లూరు ఇన్‌స్పెక్టర్ రవీందర్ పేర్కొన్నారు. సోమవారం రాత్రి తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఇంద్రానగర్‌కాలనీ సమీపంలో పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. ఆయన మాట్లాడుతూ.. వాహనదారుల వాహనాలకు సంబంధించిన పత్రాలను, లైసెన్స్‌ను దగ్గర ఉంచుకోవాలన్నారు. మితి మీరిన వేగం ప్రమాదాలకు దారితీస్తుందని వివరించారు.

◆ **భక్తుల సహకారంతో మందిరం నిర్మాణం**

సదాశివపేట(సంగారెడ్డి): సంగమేశ్వర మందిరం ఆవరణలో ఆదిగురువు దత్తాత్రేయ మందిరం నిర్మించాలని సంగమేశ్వర భజన భక్త బృందం సభ్యులు నిర్ణయించారు. అలాగే, దత్త విగ్రహ ప్రతిష్ఠాపనకు పట్టణ ప్రజలు, భక్తులు విరాళాలు సమర్పించి సహకరించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పూజారులు మోహన్‌రావు, నారాయణరావు, సర్వోత్తమశర్మ, కౌన్సిలర్ శివకుమార్ భక్త బృందం పాల్గొన్నారు.

◆ **ఊరూరా మల్లికార్జునస్వామి ఉత్సవాలు**

జహీరాబాద్ టౌన్: నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో భ్రమరాంబ మల్లికార్జున్ స్వామి జాతర ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. గొల్ల కురుమ యాదవ సోదరులు ప్రతి సంవత్సరం మల్లికార్జున స్వామి ఉత్సవాలు నిర్వహిస్తూ ప్రత్యేక పూజలు చేస్తుంటారు. బోనాల ఊరేగింపు, పోతురాజుల విన్యాసాలు చేపడుతారు. సోమవారం మండలంలోని గొవన్‌పల్లి, హోతి(కె) తదితర గ్రామాల్లో ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే కె.మాణిక్‌రావు, డీసీఎంఎస్ చైర్మన్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తట్టు నారాయణ స్వామివారిని దర్శించుకున్నారు.

◆ **22 మందికి జరిమానా**

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ అండ్ డ్రైవ్‌లో పట్టుపడిన వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ట్రాఫిక్ సీఐ లాలూనాయక్ కథనం ప్రకారం.. ఆదివారం నిర్వహించిన డ్రంకెన్ అండ్ డ్రైవ్‌లో 22 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారిని సోమవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపరచగా 19 మందికి ఒక్కొక్కరికి రూ.1500 జరిమానా.. మరో ముగ్గురికి రూ. వెయ్యి చొప్పున జరిమానా విధించినట్లు పోలీసులు పేర్కొన్నారు.

◆ **అప్రమత్తంగా ఉండాలి**

సంగారెడ్డి ఎడ్యుకేషన్: వినియోగదారులు కొనుగోలు సమయాల్లో అప్రమత్తంగా ఉండాలని వినియోగదారుల ఫోరం న్యాయమూర్తి విజయ్‌కుమార్ పేర్కొన్నారు. సోమవారం సంగారెడ్డిలోని తారా ప్రభుత్వ జాతీయ వినియోగదారుల దినోత్సవాన్ని పురస్కరించుకొని 'వినియోగదారులు–రక్షణ చట్టాలు అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయ్‌కుమార్ మాట్లాడుతూ.. వినియోగదారులు చైతన్యవంతంగా ఉన్నప్పుడే ఉత్పత్తిదారులు, అమ్మకపుదారుల అక్రమ కార్యకలాపాల నుంచి రక్షణ పొందుతారన్నారు.

◆ **హైమాస్ట్ లైట్ల ఏర్పాటు**

నారాయణఖేడ్: మనూరు మండలం తిమ్మాపూర్ గ్రామంలోని ప్రార్థనామందిరం (చర్చి) వద్ద సోమవారం మనూరు మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు ఆకాష్‌రావు హైమాస్ట్ వీధి దీపాలను ఏర్పాటు చేయించారు. క్రైస్తవుల అతిపెద్ద పండుగైన క్రిస్మస్ పండుగ సందర్భంగా ఏర్పాటు చేయించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సీ కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు.